విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 25, ఆగస్టు 2023

ప్రయివేటు మిల్క్ డైరీ ఏర్పాటుకు భూములు ఇవ్వం..

● ఆర్డీఓ మధుసూదన్‌తో రైతుల వాగ్వాదం

మాట్లాడుతున్న నాయకులు

విశాలాంధ్ర-రాప్తాడు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రైవేట్ మిల్క్ డైరీ ఏర్పాటుకు మా భూములు ఇచ్చేదిలేదని రాప్తాడుకు చెందిన ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగారు. రాప్తాడు పొలంలోని సర్వే నంబరు 274లో దాదాపు ఆరేళ్ల క్రితం 12.70 సెంట్లు రెవెన్యూ విభాగం వారు భూ సేకరణ చేసి ఏపీఐఐసీకి అప్పగించారు. ఇందులో భాగంగా గాయత్రి ప్రైవేట్ మిల్క్ డైరీ ఏర్పాటుకు 02/05/2023వ తేదీన ఏపీఐఐసీ వారు 7.90సెంట్లు కేటాయించారు. మిల్క్ డైరీ యాజమాన్యం పొలంలోకి గురువారం వచ్చి చదును చేస్తుండగా సమాచారం అందుకున్న భూయజమానులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం ఆర్డీవో మధుసూదన్, ఏపీఐఐసీ జడ్ఎం వరప్రసాదరావు అక్కడికి చేరుకోగా వారితో ఆయకట్టు రైతులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీరికి మద్దతుగా వైసీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు మద్దతు పలికారు. తమ భూములు ప్రభుత్వానికి అప్పచెప్పి దాదాపు ఆరేళ్ల గడిచినా నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే మంచి పరిశ్రమ స్థాపిస్తారనుకుంటే ప్రైవేటు డైరీ ఏర్పాటుకు తమ భూములు కేటాయించడం ఎంతవరకు సమంజసమని అనంతపురం ఆర్.డి.ఓ మధుసూదన్, ఏపీఐఐసీ జడ్ఎం వరప్రసాదరావు, తహశీల్దార్ లక్ష్మినరసింహను ప్రశ్నించారు. రాప్తాడు చెరువులో హంద్రీనీవా నీరు ఉన్నాయని తాము పంటలు పెట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు అదేవిధంగా ప్రస్తుత మార్కెట్ రేట్ ప్రకారం ఎకరం రూ.3 కోట్లకు పైగా ధర ఉంటే మా భూములకు మాత్రం ఎకరాకు రూ.8 లక్షలు మాత్రమే ఇస్తామనడం భావ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ మిల్క్ డైరీ ఏర్పాటుకు మా భూములు ఇచ్చేది లేదన్నారు. దీనిపై ఆర్డిఓ మధుసూదన్ మాట్లాడుతూ అసైన్డ్ భూములు భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం సేకరించిందని... రైతులు తమ ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇవ్వకపోవడం వల్లే నష్టపరిహారం ఇవ్వలేకపోయామని ఇప్పటికైనా మీరు భూములకు సంబంధించి పత్రాలు సమర్పిస్తే వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. భూమి రైతులకు తిరిగి ఇవ్వడం కుదరదని, రైతులంతా కలిసి ఆర్డీఓ ఆఫీసుకు వచ్చి మాట్లాడాలని కోరారు. రైతులు మాట్లాడుతూ ఇక్కడ మంచి పరిశ్రమ ఏర్పాటు చేస్తే చదువుకున్న నిరుద్యోగ యువతకు మంచి ఉద్యోగం, ఉపాధి కలుగుతుందన్నారు. డైరీ ఏర్పాటు చేస్తామంటే మాకు ఎటువంటి పరిహారం అవసరం లేదని.. మా భూములు మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిత్రెడ్డి సత్తిరెడ్డి, మరూరు ఆది, నారాయణస్వామి, సాకే చంద్ర, చిట్రా వెంకటేష్, పూలకుంట నరేంద్రరెడ్డి, సింగారప్ప, సీపీఐ సాకే నాగరాజు, సీపీఎం పోతులయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ కోతలు ఆపకపోతే రైతుల ఆగ్రహం తప్పదు

▸ ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున

▸ విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా

మాట్లాడుతున్న మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లాలో కొనసాగుతున్న విద్యుత్ కోతలపై రైతు సంఘం నాయకులు ఆందోళన బాటపట్టారు. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యమా నికి ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ కోతలు విపరీతంగా పెరగడంతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండిస్తున్న పంటలు నీరు లేక పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.

గత 15 రోజులుగా రైతులు స్వచ్ఛందంగా సబ్ స్టేషన్ల వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టినా అటు ప్రభుత్వంలోనూ, ఉన్నతాధికారుల్లోనూ చలనం లేకుండా పోయిందని విరుచుకు పడ్డారు. చేతికి రావాల్సిన పంటలు ఎండి పోతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోన్నారు. లక్షల పెట్టుబడి పెట్టి రైతులు అప్పులపాలైపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల అధిక వర్షాలు, అకాల వర్షాలతో ఇప్పటికే జిల్లాలో పంటలు నాశనమై అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. విద్యుత్ శాఖ ఎస్సికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్ప యాదవ్, ఉపాధ్యక్షుడు బండి రామకృష్ణ, నాయకులు మనోహర్, రాము, వెంకట్రాముడు, మధు, వెంకటనారాయణ,రమేష్, రవీంద్ర, నగేష్, నరేంద్ర, దుర్గాప్రసాద్, వెంకట్,ఓబిరెడ్డి పాల్గొన్నారు.

జయహో ఇస్రో శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర -రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలో గురువారం చంద్రయాన్ 3 విజయంపై సిపిఐ, సిపిఎం వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయలో అధికారులకు, ప్రజలకు స్వీట్లు పంచారు. నాయకులు మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు కృషి వల్ల ప్రపంచ దేశాలు అన్నీ భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సిపిఎం తాలూకా ప్రధాన కార్యదర్శులు నాగార్జున, మల్లికార్జున, సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్రెష్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు అంజి, కుమార్, సీపీఐ నాయకులు తిప్పేస్వామి, నర్సింహులు, నాగరాజు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-కూడేరు: సెప్టెంబర్ 8 చలో విజయవాడను జయప్రదం చేయాలని గురువారం కూడేరులోని మధ్యాహ్న భోజన సెంటర్ నందు. గోడపత్రికలు విడుదల చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటీయు యూనియన్ జిల్లా అధ్యక్షులు సి.జయమ్మ యూనియన్ మండల అధ్యక్షులు లక్ష్మి దేవి, పార్వ తమ్మ, సుజాత, శ్రీకాంత్, వేణుగోపాల్, ముత్యాలు,లక్ష్మీ బాయ్,మహేష్ పాల్గొన్నారు.

బస్సు యాత్ర పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరులోని ఆర్‌డీటీ స్కూల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించండి! దేశాన్ని కాపాడండి. సిపిఐ ప్రచార బస్సు యాత్ర పోస్టర్లు రిలీజ్ చేయడం జరిగింది. సిపిఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ సిపిఐ ప్రచార జాత బస్సు యాత్ర ఈ నెల 17 విశాఖపట్నంలో ప్రారంభమై సెప్టెంబర్ 8న తిరుపతి బహిరంగ సభతో 8 వ తేదీన ముగియనుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజా సేవకులవ్వాలి అన్నారు.

పగటిపూట విద్యుత్ సరఫరా ఇవ్వండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద గురువారము రైతు సంఘం మండల కార్యదర్శి రాజా రామిరెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎం.యుగంధర్ రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రగుంటపల్లి, రావి వెంకటాంపల్లి, చిన్నపల్లి, తాతగారి పల్లి గ్రామాల పరిధిలో ఉన్న పొలాలలో ఈ ఖరీఫ్ సీజన్లో మొక్కజొన్న, కంది, పత్తి, కొర్ర, ఉద్ది, కరివేపాకు తదితర పంటలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు చంద్ర శేఖర్‌రెడ్డి, మల్లికార్జున, రామకృష్ణయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మారిషస్ దేశాధ్యక్షుడి చేతులమీదుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-ఉరవకొండ: విద్యా రంగానికి చేసిన సేవలకు మరియు వేలాది మంది విద్యార్థులకు బంగారు బాట వేసిన సాయిబాబా విద్యాసంస్థల ఛైర్మన్ మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అయిన ఎంవి రామచంద్రారెడ్డి మారిషస్ దేశ అధ్య క్షుడి చేతుల మీదుగా అవార్డును అందుకోవడం హర్షనీయమని ఉరవకొండ ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ అధ్యక్షులు రఘు రాములు తెలిపారు. గురువారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా సంస్థలలో ప్రణాళిక బద్ధమైన బోధన, సిబ్బంది నిర్వహణలో మెరుగైన విధానాలు అమలు చేసినందుకు గాను మారిషస్ ప్రభుత్వం విద్యాశాఖ సహకారంతో ఇంటలిజెన్స్ మైండ్ ట్రస్ట్ 2023 సంవత్సరానికి ఎక్స్ లెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డుకు ఎంపికయ్యి ఆగస్టు 23వ తేదీన మారిషస్ సెక్రటరీయేట్లో ఆ దేశ అధ్యక్షులు పృథ్వీరాజ్ సింగ్ రూపాన్, మరియు మారిషస్ దేశ ఉప ప్రధాని విద్యాశాఖ మంత్రి లీలాదేవి దూకన్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అలాన్ గాను చేతులు మీదుగా అవార్డును ఎమ్మెల్సీ అందుకోవడం అభినందనీయం అన్నారు.ఎమ్మెల్సీ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలను అవార్డులను అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి

● తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి...

● ఏపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అనంతను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈమేరకు గురువారం రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేక వేరుశనగ కంది, ఆముదం, పత్తి, సద్ద, జొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయని దీంతో రైతులు ఆరు గాలం శ్రమించి పండించిన పంటకు ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని వ్యవసాయం సాగు చేస్తే అన్నదాతలు, కౌలు రైతులకు కన్నీటి గాధలే మిగిలాయన్నారు.గత సంవత్సరం అధిక వర్షాలు, అకాలవర్షాలతో వేరుశనగ, పత్తి తదితర పంటలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. రైతులు కరువు కోరల్లో చిక్కుకుని అలమటిస్తున్నా వైసీపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అప్పులపాలైన రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి కరువు అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుండిఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పంట పొలాలను పరిశీలిస్తామని అనంతరం 28 న సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండి రామకృష్ణ, మనోహర,రాము ,మధు యాదవ్, వెంకట్ నారాయణ, వెంకటరాముడు యాదవ్, నాగేష్, ఓబిరెడ్డి, ఆదినారాయణ ,శేఖర్, కుల్లయప్ప, చిట్రా నాగేంద్ర, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి...

▸ కళ్యాణదుర్గం డీఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కల్గి ఉండటం వల్ల ముమ్ముందు భవిష్యత్తుకు ఈ అవగాహన దోహదం చేస్తుందని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు అభిప్రాయ పడ్డారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కంబదూరు మండలం తిమ్మాపురం యోగి వేమన గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిశయాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు-అనర్థాలు, రోడ్డు భద్రతా నిబంధనల పాటించడంలో భాగంగా హెల్మెట్/సీట్ బెల్ట్ ధారణ, తదితర అంశాలపై అవగాహన చేశారు. కంబదూరు ఎస్సై రాజేష్, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ భవనం నందు జిల్లాలో వివిధ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు ప్రమాద కర లక్షణాలు కలిగిన గర్భిణీ స్త్రీ లు సుఖ ప్రసవం జరగడానికి తీసుకోవలసిన చర్యలకు సంబంధించి డాక్టర్లకు గురువారం రెండవ బ్యాచ్ వారికీ శిక్షణ ఇవ్వడం జరిగింది.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.యుగంధర్ మాట్లాడుతూ ప్రమాద కర లక్షణాలు కలిగిన గర్భవతులను వీలైనంత త్వరగా గుర్తించాలని, తద్వారా సుఖ ప్రసవం జరిగేలా చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డా.మహేంద్రనాథ్, డా.కావ్య, డా.రోహిణి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ అనంత నూతన కార్యవర్గం ఎన్నిక

రమణయ్య, కుల్లాయి స్వామి

విశాలాంధ్ర - జెఎన్టియు ఏ: అనంతపురం నగరంలో వికే మెమోరియల్ హాల్ లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నిర్మాణ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ నిర్మాణ మహాసభలలో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నికలు చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నూతన అధ్యక్షులుగా ఎస్.రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈ.కుళాయిస్వామి, కోశాధికారిగా హనుమంతు రాయుడు, ఉపాధ్యక్షులుగా ఆనంద్, సాయిస్వరూప, వంశీ,నరసింహ యాదవ్,సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు,శవణ్,కృష్ణ, వెంకట్ నాయక్, వీరితోపాటు 23 మంది కార్యవర్గ సభ్యులు 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పి. నారాయణస్వామి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్సన్ బాబు శివారెడ్డి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, తెలిపారు. మాకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికకు సహకరించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీకి సిపిఐ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం : మంత్రి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష్రశ్రీ చరణ్ అన్నారు. కుందుర్పి, అపిలేపల్లి, మలయనూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను గురువారం మంత్రి ఉషాశ్రీచరణ్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంను సీఎం జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా నిజం చేస్తూ సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో నేరుగా ప్రజల వద్దకే అందిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి అధికారులు, వైసీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటిసి, ఎంపీపీ పాల్గొన్నారు.

సంధ్యను పరామర్శించిన పద్మావతి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంత జిల్లా సర్వజన ఆస్పత్రి నందు పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న సంధ్యను అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి గురువారం పరామర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజక వర్గం ఆత్మకూరు మండలం నందు బొమ్మయ్య మనమ్మకి ఇద్దరమ్మాయిలు ఒక బాబు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్లి కాక రెండవ కూతురు సంధ్య పదవ తరగతి వరకు చదివి ఇంటిలోనే ఉండేదన్నారు. ,నిందలు మోయలేక మనస్థాపానికి గురై గురువారం 8 గంటలకు పురుగుల మందు తాగి పడిపోయిందని, న్యాయం చేస్తామని కుటుంబానికి ధైర్యం చెప్పామని వివరించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, శ్రీకాంత్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి లింగమయ్య, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి శారద, అనంతపురం నగర అధ్యక్షురాలు జానకి ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 25, ఆగస్టు 2023

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

- కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది..
- ఎంపీడీఓకు పారిశుధ్య కార్మికుల వినతి

ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

విశాలాంధ్ర-రొళ్ల: పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని గురువారం ఎంపీడీవో కల్లుమడి ఆజాద్‌కు వినతి పత్రం ద్వారా వినిపించారు. మండలం లోని పది గ్రామ పంచాయతీలో పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 11 నెలలుగా జీతాలు అందకపోవడంతో తమ కుటుంబాల జీవన పరిస్థితులు దారణంగా ఉన్నాయని తెలియజేశారు. తమకు అందించే జీతాలు నేరుగా తమ ఖాతాలోకే జమా అయ్యే విధంగా చూడాలని వారు కోరారు. పంచాయతీల ఖాతా నుంచి సర్పంచులు తమకు జీతాలు సక్రమంగా అందడం లేదన్నారు. తమకు ప్రతి నెల నెలవారీగా జీతాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ కార్మికులు గుజ్జయ్య, లక్ష్మీనరసప్ప, హనుమంతరాయప్ప, నరసింహ మూర్తి, జయలక్ష్మమ్మ, రామకృష్ణప్ప, భూతప్ప, రంగప్ప డిమాండ్ చేశారు.

పంటలు ఎండిపోయి అప్పుల ఊబిలోకి రైతులు

- అన్నదాతను ఆదుకోవాలి.. ఏపీ రైతు సంఘం జిల్లా బృందం

పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్య సాయి : చెన్నేకొత్తపల్లి మండలంలో పూర్తిగా నష్టపోయిన వేరుశనగ పంటలను గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ గౌరవ అధ్యక్షులు బెల్లం మహదేవ్, ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేరుశనగ ,కంది, మొక్కజొన్న ,తదితర పంటలు వర్షం లేక పూర్తిస్థాయిలో ఎండిపోవడం జరిగినది. అదేవిధంగా చెరువులలో నీరు లేకపోవడంతో బోర్లు సైతం నీరింకపోవడంతో బోర్ల ద్వారా సాగు చేస్తున్న పంటలు సైతం ఎండిపోవడం జరుగుతున్నది. వర్షం రాకపోవడంతో వేల ఎకరాలలో పెట్టిన వివిధ రకాల పంటలు ఎండి పోవడంతో రైతులు పూర్తిస్థాయిలో అప్పుల ఊబిలో కూరుకుపోవడం జరుగుతున్నది. కావున కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడం కోసం బ్యాంకులలో ఉన్న రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని, పంటలకు పూర్తిస్థాయిలో ఇన్సూరెన్స్ నష్టపరిహారం వచ్చే విధంగా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపి నూరు శాతం రైతులకు న్యాయం జరిగే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా హంద్రీనీవా కాలువకు నీరును వదిలి శ్రీ సత్య జిల్లాలోని 32 మండలాల్లోని ప్రతి చెరువుకు నీరు నింపే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు తరఫున ఏపీ రైతు సంఘం జిల్లా సమితి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికెపల్లి రైతు సంఘం మండల నాయకులు ముత్యాలప్ప, నాగరాజు, నరసింహులు, గోపాల్, రామగిరి మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి ముత్యాలప్ప పాల్గొన్నారు.

శ్రీ సత్య కృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల ఎస్కే యూనివర్సిటీ మూడవ సంవత్సరం బిఎస్సి ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో శ్రీ సత్య కృపా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు మంచి ప్రతిభను ఘనపరచారని కరస్పాండెంట్ పెద్దిరెడ్డి, తెలిపారు. కళాశాల ప్రతి సంవత్సరము అత్యుత్తమ ఫలితాలను అందిస్తూ, విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వడం పట్ల తాము సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. నేటి పరీక్ష ఫలితాలలో ఎస్.పర్వీన్ భాను 95 శాతము, కే.ప్రమీదా 91 శాతం, ఎస్.పవిత్ర 89 శాతం, జి.సింధు తులాని 88 శాతం, ఎం.అఖిల 88 శాతం. ఎం.వెంకట విజయలక్ష్మి 88 శాతం ప్రతిభ కనపరిచారని తెలిపారు. అనంతరం విద్యార్థులను కరెస్పాండెంట్ పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

హనుమాన్ దర్శన్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హనుమాన్ దర్శన్ సర్వీసు ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ తెలిపారు. గురువారం ప్రచారం చేశారు. బత్తలపల్లి లోని ప్రధాన నాలుగు రోడ్ల కూడలి వద్ద కూడా ప్రజలకు హనుమాన్ దర్శన్ బస్సులను ప్రతి మంగళ, శనివారాలలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నా మని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగార్జున రెడ్డి, వైవియన్. రెడ్డి, ఎస్.శంకరయ్య, తిరుమలేశు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయంపై విద్యార్థులు ర్యాలీ

విశాలాంధ్ర-కొత్తచెరువు: చంద్రయన్ విజయవంతం పట్ల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పెనుగొండ రోడ్డు నుండి పురవీధుల గుండా 170 మీటర్ల జాతీయ జెండాను ర్యాలీగా ప్రదర్శిస్తూ భారత్ మాతాకు జై అని నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కోడలికి చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించారు. చంద్రయన్ విజయవంతానికి శాస్త్రవేత్తలు చేసిన కృషి మరువలేనిదని, ప్రపంచ దేశాలు గర్వించేదగా మన దేశ ప్రతిష్ట పెంచారన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ రెడ్డి, ఏవో కేశవరెడ్డి, డ్రిన్ను హనుమంతు పాల్గొన్నారు.

రైతులని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: జిల్లా లో వర్షభావ పరిస్థితి ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేసారు. గురువారం ముదిగుబ్బ లో వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో రెండు లక్షల నలభై మూడువేల హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా వర్షాలు లేకపోవడంతో కేవలం 14 వేల హెక్టార్లు మాత్రమే సాగు చేసారు అని అన్నారు. సాగుతో సంబంధం లేకుండా రైతులందరికీ ధరల స్థిరీకరణ నిధి నుంచి రైతులందరికీ పరిహారం చెల్లించా లని బిజెపి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సోమల ప్రకాష్ నాయుడు,' అసెంబ్లీ కన్వీనర్ గోపాల్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, రాప్తాడు అసెంబ్లీ కన్వీనర్ జిలకర ఆంజనేయులు,ధర్మవరం అసెంబ్లీ కో-కన్వీనర్ చట్ట నారాయణ స్వామి, రామ గిరి మండలాధ్యక్షుడు శ్రీనాథ్,రామకృష్ణ, కార్తీక్ వసువులేటి పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయానికి ఇస్రో శాస్త్రవేత్తల కృషి అనన్యనీయం

- ప్రపంచ దేశాలకు భారత్ స్ఫూర్తిగా నిలిచింది
- రిటైర్డ్ కంటి వైద్యాధికారి డా.నరసింహులు

విశాలాంధ్ర-ధర్మవరం: చంద్రయాన్ 3 విజయానికి ఇస్రో శాస్త్రవేత్తల కృషి అనన్యనీయమని, భారత దేశం గర్వించదగ్గ విజయాన్ని సాధిం చడం ప్రజలం దరి విజయమని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు, పట్టణ ప్రముఖులు, శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయ అధ్యక్షులు, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు, జయశ్రీ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రునిపై ఉన్న మూలాలను శోధించడం, చంద్రుని ఉపరితలంపై లభ్యమయ్యే రసాయ నాలు, సహజ మూలకాలు, నేల, నీరు మొదలైన వాటిపై అక్కడే శాస్త్రీయ ప్రయోగాలు పరిశీలనలు చేయడం శుభదాయకమన్నారు. రెండు గ్రహాల మధ్య యాత్రలు చేసేందుకు అవసరమైన కొత్త టెక్నాలజీల అభివృద్ధి కోసం చంద్రయాన్ 3 మిషన్ విజయవంతం కావడం వెనుక భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు చేసిన కృషి చాలా ఉందని తెలిపారు. నేడు భారతదేశం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలవడం మన అదృష్టం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశం నాకేమీ ఇచ్చింది అని అనకుండా, దేశం కోసం నేను ఏమి చేస్తున్నాను అన్న ఆలోచనతో ముందుకు వెళితే, భారతదేశం అన్ని విభాగాలలో విజయవంతం అవుతుందని తెలిపారు.

అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు..

విశాలాంధ్ర-ధర్మవరం: భారతదేశంలో బుధవారం చరిత్ర పుట్టలో ఎక్కిన రోజు సందర్భంగా అనగా చంద్రయాత్రి విజయవంతం కావడం పట్ల పలుచోట్ల విజయోత్సవ సంబరాలను జరుపు కున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని కాక తీయ విద్యా నికేతన్ లో విద్యా ర్థులు ఇస్రో కంగ్రాట్స్ ఆకారం లో వినూత్నంగా ప్రదర్శించారు. పాఠశాల ఫౌండర్ మేడాపురం రామిరెడ్డి మాట్లాడుతూ భారతీ యుల ఆశలను తనతోపాటు మోసుకెళ్లిన చంద్రయాన్ 3 చందమామపై భారతీయ కీర్తిని వెదజల్లడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ నిర్మల జయచంద్ర రెడ్డి, డైరెక్టర్లు సూర్య ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు పట్టణంలోని ప్రధాన విధులు గుండా జాతీయ పతాకం జెండాలను పట్టుకొని ర్యాలీ నిర్వహించి, భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్తల కృషిని కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత రెడ్డిలు అభినందించారు. తదుపరి చంద్రన్న కాంప్లెక్స్ లో యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్ రెడ్డి, సభ్యులు ఈశ్వరయ్య, కట్టా రవికుమార్, సాయి ప్రసాద్, రామకృష్ణయ్య, సుధీర్ రెడ్డి, మేకల రామాంజనేయులు, జిగ్నేశులు, యోగాసనాల ప్రదర్శన ద్వారా శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

- సిపిఐ కార్యదర్శి ఆంజనేయుడు పిలుపు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: రాష్ట్ర పరిరక్షణ కోసం సిపిఐ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని పుట్టపర్తి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం సిపిఐ బస్సు యాత్ర పోస్టల్ విడుదల చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర సెప్టెంబర్ 5న శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరిలో బహిరంగ సభ ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో తరలి రావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం నాయకులు పూల శ్రీనివాసులు, మహిళా సంఘం నాయకురాలు రత్నాబాయి, సిపిఐ నాయకులు రవి, రామాంజులు, దేవేంద్ర, అంజనప్ప, వెంకటరమణ, రమణప్ప, ఎల్లప్ప, రమణమ్మ, నారాయణ పాల్గొన్నారు.

కవల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పోతుకుంట కాలనీలో కవల పిల్లలకు జన్మనిచ్చి, తల్లి మృతి చెందింది. మొదటి కాన్పులో మూడు సంవత్సరాల పాప కూడా ఉంది. తల్లి చనిపోవడంతో పిల్లలకు పౌష్టిక ఆహారం అవసరం ఉన్నందున దాత రాఘవ కు సమాచారాన్ని అందించడంతో, వారు దాతృత్వంతో ఆ పిల్లలకు రెండు నెలలకు సరిపడు పౌష్టిక ఆహారం "లాక్టో జెన్ మిల్క్ పౌడర్ ను" తారక్ చేయూత ట్రస్ట్ ద్వారా అందించడం జరిగింది అని అని అధ్యక్షులు రామాంజి తెలిపారు. తండ్రి తారక్ చేత ట్రస్ట్ కు దాత రాఘవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తారక్ చేయుట ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో వివేకానంద డిగ్రీ కాలేజీ ప్రతిభ

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన 5వ సెమిస్టర్ బీఎస్సీ ఫలితాలలో స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వాన్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నాడు కళాశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచి ఆయన అభినందించారు. తమ విద్యార్థులు హేమలత 97 శాతము తో టాప్ ఫస్ట్ సాధించిందని తెలిపారు. అలాగే మొక్షిని 94 శాతము మాధవి 91 శాతం, షబానా 90 శాతం, దుర్గేశ్ 89 శాతం, నీహ ఫీర్దోజ్,చాందిని 87 శాతము, నవ్యశ్రీ 86శాతము, స్వరూప 85 శాతము,మునీరబి, రిజ్వాన 83 శాతం, మనోహర్, లక్ష్మీనరసింహ 81 శాతము, మనోజ్ కుమార్ 80 శాతం సాధించారని తెలిపారు. కళాశాల ఉత్తీర్ణత శాతం 89 శాతముగా నమోదైనదని , ఇంతటి మహత్తర విజయాన్ని అందించిన విద్యార్థులకు తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కరిముల్లా, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహమూర్తి అధ్యక్షతన హిందూపురం నియేజకవర్గ సుమావేశం గురువారం నిర్వహించారు . ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షా కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, వల్లం రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికై ఎఐఎస్ఎఫ్ నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ జూ.కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, డిగ్రీ పాత విధానంలోనే మూడేళ్ల డిగ్రీ విధానాన్ని కొనసాగించాలని తెలిపారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రెన్స్ పరీక్షను రద్దు చేస్తూ పాత విధానంలోనే పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. హిందూపురం నియోజకవర్గం అధ్యక్షులుగా దేవరాజు, ఉపాధ్యక్షులుగా వరుణ్, పవన్, సాయి, సునీత, ప్రధాన కార్యదర్శిగా నరసింహ మూర్తి, సహాయ కార్యదర్శులుగా దినేష్ , కార్తీక్, జితేంద్ర, పవన్ కోశాధికారిగా వేణుగోపాల్,19 మంది కార్యవర్గం 35కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు

రాష్ట్ర గౌరవ అధ్యక్ష పదవి మరింత బాధ్యత పెంచింది

- ఏపీ వీవర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు గిర్రాజు రవి

విశాలాంధ్ర-ధర్మవరం: ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వివర్స్ ఫెడరేషన్ అసోసియేషన్కు గౌరవ అధ్యక్షులుగా నన్ను ఎంపిక చేయడం మరింత బాధ్యతను పెంచిందని గిర్రాజు రవి పేర్కొన్నారు. గురువారం వారు మాట్లా డుతూ ప్రస్తుతం నేను ధర్మవరంలో పట్టు చీరల తయారీ వ్యాపారస్తుల సంఘం కు అధ్యక్షులుగా కొన్ని రోజులుగా నా సేవలు కొనసాగిస్తున్నాని తెలిపారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టుచీరల వ్యాపా రస్తులకు ఇటీవల విజయవాడ వ్యాపారులచే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న సందర్భంలో తొలిసారిగా ధర్మవరం పట్టణంలో పట్టు చీరల తయారీ వ్యాపారస్తుల సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
నేడు ఈ సంఘం ద్వారా దశలవారీగా చీరల బాకీ ఉన్న వారందరి వద్ద ధర్మవరం వ్యాపారస్తులకు డబ్బులను ఇప్పించడం జరిగిందన్నారు. నా సేవలు గుర్తించి, అతి తక్కువ సమయంలోనే నన్ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీవర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకోవడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. ఈనెల 27వ తేదీ ఆదివారం వైజాగ్‌లోని గాజువాకలో తాను ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాను రాష్ట్రంలో ఉన్నటువంటి పట్టు చీరల వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించుటలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ధర్మవరం పట్టు చీరల వ్యాపారులు, శ్రేయోభిలాషులు, పట్టణ ప్రముఖులు, బంధుమిత్రులు కలిసి గిర్రాజు రవిని అభినందించారు.